క్లుప్తంగా

చెప్పులు పంపిణీ

ప్రొద్దుటూరు : పట్టణంలోని నిరాశ్రయులకు, అ. నాథలకు, యాచకులకు శ్రీపాద శ్రీవల్లభ అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం 70 జతల చెప్పులను పంపిణీ చేశారు. సేవా సమితి నిర్వాహకుడు కొండల భరద్వాజ్ రెడ్డి మాట్లాడుతూ గోసుపాటి ఓబుళరెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా గోసుపాటి నారాయణమ్మ, ఓబుళ రెడ్డి చారిటబుల్ ట్రస్టు సహకారంతో చెప్పులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హర్ష వర్ధన్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.

మసీదు వద్ద రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు



మరమ్మతులకు నోచుకోనున్న మసీదుకు వెళ్లే మార్గం

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లెలో మసీదు వద్ద దెబ్బతిన్న రోడ్డు నిర్మాణానికి రూ.50లక్ష లతో ప్రతిపాదనలు పంపినట్లు ఆర్ అండ్ బీ ఏఈ దాదాబాషా తెలిపారు. గత కొన్నేళ్లగా రోడ్డుకిరువైపులా ఇళ్ల నిర్మాణాలు పెరగడంతో రోడ్డు తగ్గుదల అయిందని దీంతో వర్షం వచ్చిన ప్రతీసారి రోడ్డుపై నీరు నిలువ ఉంటోందని దీంతో మసీదుకు వచ్చే వారికి ఇబ్బందికరంగా మారిందన్నారు. దీంతో యుద్ధప్రతిపాదికన రోడ్డు నిర్మించేందుకు రూ.50లక్షల నిధులతో ప్రతిపాదనలు పంపామన్నారు.

కంప్యూటర్ వితరణ

రాజుపాళెం : మండలంలోని పగిడేల గ్రామ పంచాయతీ కార్యాలయానికి గ్రామ నివాసి సబ్ రిజిస్ట్రార్ (హైదరాబాద్) జీవీ సుబ్బారెడ్డి కంప్యూటర్‌ను వితరణగా అందించారు. ఆ కంప్యూటర్‌ను శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేసి సర్పంచ్ కానాల రాధా, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బల రామిరెడ్డి, దాతలు జీవీ సుబ్బారెడ్డి, ఏరువ నారాయణరెడ్డిలు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్, బలరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ బీమా అందజేత

ప్రొద్దుటూరు : స్థానిక 25వ వార్డులో నివాసం ఉంటున్న షేక్ ఆలీ షేర్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య షేక్ మెహతాబ్‌కు శుక్రవారం వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద 25వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నూరి రూ.10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ అడ్మిన్ లావణ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ సువర్ణ, వీఆర్ఓ అంజి పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ప్రొద్దుటూరు : తల్లులు మంచి పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత కుమారి తెలిపారు. శుక్రవారం ఆంధ్రకేసరి రోడ్డులోని సంజీవనగర్–2 అంగన్‌వాడీ కేంద్రంలో షోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బమ్మ, మరియమ్మ, ఆయాలు అనూష, నారాయణమ్మ పాల్గొన్నారు.

27న బహిరంగ వేలం

దువ్వూరు : దువ్వూరు పంచాయతీకి చెందిన దినసరి మార్కెట్, బస్టాండ్ రుసుం, షాపింగ్ కాంప్లెక్స్‌లకు ఈనెల 27న సోమవారం మధ్యాహ్నం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వీరారెడ్డి శుక్రవారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు సోమవారం మధ్యాహ్నంలోపు రూ.20వేలు డిపాజిట్ చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఖాజీపేట ఎమ్మార్పీఎస్ కన్వీనర్‌గా విజయ భాస్కర్

ఖాజీపేట : మండల ఎమ్మార్పీస్ నూతన కన్వీనర్‌గా విజయభాస్కర్‌ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ వెంకటేష్, జిల్లా ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగల కన్వీనర్ శివయ్య అధ్వర్యంలో ఖాజీపేటలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కన్వీనర్‌గా విజయ భాస్కర్‌ను ఎన్నుకున్నారు. మాదిగల హక్కుల కోసం తన వంతు కృషి చేస్తానని నూతన కన్వీనర్ విజయ భాస్కర్ తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్జీవో కాలనీలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ హాలులో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ చైర్మన్ వి.రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రొద్దుటూరు కల్చరల్ / ప్రొద్దుటూరు క్రైం : ఆకస్మికంగా సంభవించే ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్, అగ్నిమాపకశాఖ అధికారి రఘునాథ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కేఎస్‌సీ డిగ్రీకాలేజిలో శుక్రవారం విపత్తులు, ఎన్డీఆర్ఎఫ్ అందించే సహాయక చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ టీం లీడర్ మహ్మద్ అలీ, కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రయ్య, అధ్యాపకులు, రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు శాఖల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం

బద్వేలు అర్బన్ : క్షయవ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేసి క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎన్జీవో హోం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి ప్రాణాంతక వ్యాధి కాదని, ప్రస్తుతం మెరుగైన వైద్య చికిత్సలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజేష్, క్షయవ్యాధి నివారణ పర్యవేక్షకులు నరసింహప్రసాద్, బ్రహ్మారెడ్డి, గోపవరం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, టీబీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు జోత్స్న, స్వర్ణలత, వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బద్వేలు : పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



చాపాడు : వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

క్షయవ్యాధిని పారద్రోలుదాం

బి.కోడూరు : ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రమైన బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రతిజ్ఞలో ఆరోగ్య సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని క్షయవ్యాధితో బాధపడుతున్న వారికి చికిత్స కోసం చూపిస్తామని, క్షయ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తామని, క్షయ వ్యాధికి సంబంధించిన అన్ని పరీక్షలు, మందులు పూర్తిగా ఉచితంగా అందించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రామకృష్ణ, కె.కుమార్, ఎస్.భాగ్యమ్మ, మాళవిక, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ క్షయవ్యాధి నివారణపై ర్యాలీ

కాశినాయన : స్థానిక నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. క్షయ వ్యాధి నివారణ మందులు ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా లభిస్తాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు శ్రీనివాసులరెడ్డి, సుబ్బరాయుడు, ఆరోగ్య పర్యవేక్షకులు బాలయ్య, పబ్లిక్ హెల్త్‌నర్సు శారద, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్లూరు : ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో మండల వైద్యాధికారి డాక్టర్ కె.హమీదాబేగం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సి.మురళీ కృష్ణ, వైద్య సిబ్బంది లక్ష్మిదేవి, మాణిక్యమ్మ, వీరేంద్ర బాబు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'క్షయ' నివారణే ప్రభుత్వ లక్ష్యం

చాపాడు : క్షయ వ్యాధి నివారణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చాపాడు, విజయనగరం గ్రామాలలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఇదే క్రమంలో చాపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం టీబీపై పరీక్షలు రాసిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీవాణి, సీహెచ్‌ఓ రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, టీబీ సూపర్‌వైజర్ సునీల్, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు రమేష్, నారాయణ, ఏఎన్ఎం ప్రవంతి, ఆశా కార్యకర్తలు, కస్తూర్బా పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరైన చికిత్సతో క్షయవ్యాధిని నివారించవచ్చు

దువ్వూరు : సకాలంలో సరైన చికిత్స అందిస్తే క్షయ వ్యాధిని నివారించవచ్చునని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ క్షయ వ్యాధి మైక్రోబ్యాక్టీరియా ట్యూబరోక్లోస్ అనే బ్యాక్టీరియా నుంచి సంక్రమిస్తుందన్నారు. క్షయ వ్యాధి బారినపడితే తుంపర్లు, గాలి ద్వారా ఇంకొకరికి ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని తెలిపారు. పొడి దగ్గు ఉన్న వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లతో పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలపాటు మందులను, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో..

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి ఫలనీరాజ్ ఆధ్వర్యంలో బ్రహ్మంగారిమఠంలోని పురవీధుల్లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రమణయ్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో క్షయ నివారణ

మైదుకూరు : అవగాహన పెంచుకోవడం ద్వారా క్షయ రోగాన్ని నివారించవచ్చని మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కరీముల్లా అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరీముల్లా మాట్లాడుతూ క్షయ వ్యాధిని గుర్తించి మందులు, పౌష్టికాహారం వాడటం ద్వారా క్షయ వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రీనా, ఐసీటీసీ కౌన్సిలర్ ఎంవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దు

ప్రొద్దుటూరు క్రైం : క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఉండేల గురివిరెడ్డి తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం బాకరాపేట, రజకవాడ, శాస్త్రినగర్‌లలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌కుమార్, సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఏకే రోడ్డు యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో

ఏకేరోడ్డు యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సీఓ నాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.



కాశినాయన : నరసాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



మైదుకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌సీ వైద్య సిబ్బంది



దువ్వూరు: ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది



బ్రహ్మంగారిమఠం: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.వి.ఎన్.ప్రసాద్

బద్వేలు అర్బన్ : 2023–24 సంవత్సరానికి గాను బద్వేలు బార్ అసోసియేషన్‌కు శుక్రవారం కోర్టు ఆవరణలో జరిగిన ఎన్నికల్లో పి.వి.ఎన్.ప్రసాద్ ప్యానల్ విజయం సాధించింది. ఈ నెల 15న నామినేషన్లు దాఖలు చేయగా 17న నామినేషన్ల స్క్రూటిని నిర్వహించారు. 18వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ నిర్వహించగా పోటీదారులు నామినేషన్లను ఉపసంహరించుకోకపోవడంతో శుక్రవారం కోర్టు ఆవరణలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 62 ఓట్లు ఉండగా 58 ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం నుండి జరిగిన కౌంటింగ్ ప్రక్రియలో పి.వి.ఎన్.ప్రసాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా, వి.సూర్యనారాయణరెడ్డి జనరల్ సెక్రటరీగా, టి.సురేష్‌బాబు కోశాధికారిగా గెలుపొందారు. అలాగే ఉపాధ్యక్షులుగా ఎస్.రమణారెడ్డి, సహాయ కార్యదర్శిగా కె.బాబు, లైబ్రరీ సెక్రటరీగా షేక్ ఇజాజ్‌బాష, క్రీడల విభాగం కార్యదర్శిగా యు.శివకుమార్, మహిళా రెప్రజెంటేటివ్‌లుగా సాయివెన్నెల, తేజస్వినిలు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా టి.శ్రీధర్‌నాయుడు, సహాయ ఎన్నికల అధికారిగా యు.మురళీకృష్ణలు వ్యవహరించారు. అలాగే ప్యానల్ విజయానికి కృషి చేసిన సీనియర్ న్యాయవాదులు దేవిరెడ్డిబ్రహ్మారెడ్డి, ఆర్.ఆర్.వర్మలను సన్మానించారు. అలాగే నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని న్యాయవాదులు సన్మానించారు.

పోషకాలు అందించేందుకే బాలామృతం



ఖాజీపేట: సూచనలు చేస్తున్న సూపర్‌వైజర్



మైదుకూరు: మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

ఖాజీపేట : విద్యార్థులకు అందించే బాలామృతం మంచి పోషకాలు ఇస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.లక్ష్మిదేవి విద్యార్థులకు సూచించారు. తవ్వారిపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సరైన పోషకాలు ఇవ్వడం వల్ల వారు ఆరోగ్యవంతులుగా మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. పోషకాలు తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీచర్లు రామసుబ్బమ్మ, కరుణమ్మ, లక్ష్మిదేవి, సునీల్ పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం

మైదుకూరు : ఐదేళ్లలోపు పిల్లల చక్కని ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి అన్నారు. పోషణ పఖ్వాడా పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం మైదుకూరులోని మూలబాట వీధి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పిల్లల పెరుగుదలకు బాలామృతం అందిస్తున్నామని తెలిపారు. తల్లులు బాలామృతాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు నిత్యం ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలను తీసుకోవాలని చెప్పారు. సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, వరలక్ష్మి, రమాదేవి, సుగుణ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



నూతనంగా ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

గోపవరం : మండలంలోని రాచాయపేట గ్రామంలో కొలువైన శ్రీకోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. ముందుగా గణపతి హోమం నిర్వహించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో హోమంలో పాల్గొని ధ్వజస్తంభ ప్రతిష్ఠను తిలకించారు. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించి రాత్రి సీతారామ సమేతంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. బద్వేలు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రాహుల్ గాంధీపై కక్ష గట్టడం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్‌లో రాహుల్ గాంధీపై అక్రమ కేసులకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవాలు మాట్లాడిన రాహుల్ గాంధీపై కేసులు బనాయించిందన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో గంటల తరబడి ఈడీ విచారణ చేయించినప్పుడే ప్రజలకు బీజేపీ నిజస్వరూపం బయటపడిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విష్ణుప్రీతం రెడ్డి, బండి జకరయ్య, సత్తార్, కోటపాటి లక్ష్మయ్య, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు ప్రాంతాల పరిశీలన

ప్రొద్దుటూరు : రంజాన్ సందర్భంగా మసీదుల వద్ద అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలని ముస్లిం మైనారిటీ మున్సిపల్ కౌన్సిలర్లు కోరడంతో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య శుక్రవారం సాయంత్రం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. రంజాన్ మాసంలో ఉపవాసాల సందర్భంగా మసీదు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని, లైటింగ్, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కమిషనర్‌ను కోరారు. ఇందు కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి మురికి కాలువలను శుభ్రం చేసి పారిశుధ్య సమస్య లేకుండా చూస్తామని కమిషనర్ తెలిపారు. జామియా మసీదు, మక్కా మసీదు, ఖార్ హుసేన్ మసీదు, ఇస్లాంపుర మసీదు ప్రాంతాలను కమిషనర్ సందర్శించారు.

సమస్యలను పరిష్కరించండి

మైదుకూరు : రీజన్‌లోని అన్ని డిపోలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మైదుకూరు ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ డిపోలలో ఏకపక్షంగా పెట్టిన వన్‌మ్యాన్ సర్వీసులను వెంటనే రద్దు చేయాలని కోరారు. పులివెందుల డిపోలో ఫిక్స్‌డ్ చార్జును వేయాలని డిమాండ్ చేశారు. ఏఏఎస్ ఇంక్రిమెంట్లను అన్ని డిపోలలో కలపాలని తెలిపారు. అర్హత మేరకు సిక్ జీతాలను మంజూరు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిపో ఎస్ఎంయూ కార్యదర్శి వీఎస్ రాయుడు, శీనయ్య, వైఎస్ రాయుడు, ఎస్‌బీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

చలివేంద్రాలు ఏర్పాటు



రేకలకుంటలో చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మహబూబ్ బీ

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కొత్తపల్లె పంచాయతీలో లింగాపురం, రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఫౌండేషన్ చైర్మన్, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాగ్యమ్మ, వార్డు మెంబర్ తిరుపాల్‌రెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేకలకుంటలో..

బ్రహ్మంగారిమఠం : మండలంలోని రేకలకుంట గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంను శుక్రవారం మండల ఉపాధ్యక్షురాలు కూనపూలి సుహాసిణి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజానాయుడు ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం చలివేంద్రాలను ఏర్పాటు చేస్తోందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చాపాడు : మండల కేంద్రంలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ప్రొద్దుటూరు – మైదుకూరు జాతీయ రహదారిలోని కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా సర్పంచ్ చింతకుంట మహబూబ్ బీ ప్రారంభించారు. ఇదే క్రమంలో చాపాడులోని స్త్రీ శక్తి భవనం వద్ద ఇందిరా పథం, యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బ్యాంకు మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, ఏపీఎం వెంకటరమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి జానకీరామ్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు ఉచిత ఇంటర్ విద్య

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతి చదివి 90 శాతంపైగా మార్కులు సాధించిన 10 మంది పేద ప్రతిభగల విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్యను అందించనున్నట్లు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ తెలిపారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పేద ప్రతిభ గల విద్యార్థులకు సహకరించాలనే ఉద్దేశంతో తన తండ్రి చల్లా శివరామయ్య జ్ఞాపకార్థం వారు కోరిన గ్రూప్‌లో భావనా జూనియర్ కళాశాలలో ఉచిత విద్యాబోధన అందించనున్నట్లు తెలిపారు. 90 శాతం మార్కులు సాధించి మొదటగా నందిని క్లాత్‌మార్కెట్‌లోని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంప్రదించిన 10 మంది విద్యార్థినీ విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశమన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాసులు, నాగప్రసాద్, ఏసునాథరెడ్డి, శేషాద్రి, గంగాధర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చల్లా రాజగోపాల్‌యాదవ్

అక్రమ కట్టడాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభాభవనంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదని, బిల్లులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇలా అయితే అభివృద్ధి పనులు ఆగిపోయే అవకాశం ఉందన్నారు. అధికారులు చొరవ తీసుకుని ఉన్నతాధికారులతో చర్చించి బిల్లులు త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తన వార్డులో అనుమతులు లేకుండా అక్రమంగా అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నారని టౌన్ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. అక్రమ కట్టడాలపై చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చామని అధికారి తెలపడంతో అసహనానికి గురైన కౌన్సిలర్ ఓబుళరెడ్డి రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డారు. తోటి కౌన్సిలర్లు ఆయనను వారించి అధికారుల నిర్లక్ష్యంపై కమిషనర్ వెంకటరమణయ్యకు ఫిర్యాదు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 24వ వార్డు కౌన్సిలర్ కమాల్‌బాషా మాట్లాడుతూ పాఠశాలలో స్వీపర్ల సంఖ్య ఎక్కువగా ఉందని సభ దృష్టికి తెచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో గదులు ఎక్కువగా ఉన్నందున వారికి ఇచ్చే జీతం చాలడం లేదని, ఇదివరకే వారు తమ దృష్టికి తెచ్చారన్నారు. ఒక వేళ ఎక్కడైనా ఎక్కువ ఉన్నారని తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో 35 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ ఇంజినీర్ సాయికృష్ణ, డీఈ దస్తగిరి, టౌన్ ప్లానింగ్ అధికారి రాజారత్నం, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి